## క్లుప్తంగా

### వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం సభ్యులు స్వామికి అభిషేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ నిర్వహణ కమిటీ, దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. టేకిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు.

### పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి




ఆర్యావటంలో పారిశుధ్యంపై స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ జె.రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని ఆర్యావటం, గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఎంపీడీఓ రాంబాబు పర్యటించి పారిశుధ్య నిర్వహణ, పింఛన్ల పంపిణీపై విచారణ నిర్వహించారు. ఆర్యావటంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెదురుమదురు వర్షాలు కురుస్తున్నందున మండల గ్రామాల్లో అపారిశుధ్యం తలెత్తి అంటువ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉందన్నారు. పంచాయతీ సిబ్బంది వీధులను శుభ్రం చేయిస్తూ, లోతట్టు ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రాయుడు పాల్గొన్నారు.

### పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ అన్నారు. శనివారం మండలంలోని దుగ్గుదుర్రు, కుయ్యేరు, అయితపూడి, అంద్రంగి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుయ్యేరులో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లపై నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ సిస్టంను మూడు విభాగాలుగా సబ్సిడీపై ప్రజలకు అందిస్తుందన్నారు. మొదటి కేటగిరిలో 1 కేవీ యూనిట్ విద్యుత్ సిస్టంకు రూ.30 వేలు, 2 కేవీకి రూ.60 వేలు, 3 కేవీకి రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ప్రజలు విద్యుత్ అధికారులను కాని, గ్రామపంచాయతీ సిబ్బందిని కాని సంప్రదించి సబ్సిడీపై పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని పొందవచ్చన్నారు.

### ఘనంగా వనువులమ్మ జాతర



వనువులమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ దేవత వనువులమ్మ జాతర ఉత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

### బీజేపీ పట్టణ కమిటీ నియామకం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం బీజేపీ నూతన కమిటీని శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ప్రకటించారు. అధ్యక్షుడిగా నాళం ఫణిప్రకాష్, ఉపాధ్యక్షులుగా సందక వీరవెంకట సత్యనారాయణ, చంద్రు వెంకట శివప్రసాద్, పెరుమళ్ల రేణుకాదేవి, కోన ఉషాకుమారి, పందిరి వీర్రాజు, ప్రధాన కార్యదర్శులుగా జగతా రఘువీర్, కోటిపల్లి కృష్ణమాచార్యులు, కార్యదర్శులుగా మద్రి రామచంద్రరావు, మల్లువలస రాజశేఖర్, బీవీవీ సత్యనారాయణ, మొండి దుర్గాదేవి, వల్లభనేని విజయమంగళాదేవి, కోశాధికారిగా చంద్రు అఖిలాదేవిలను ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్, కోకన్వీనర్ కంకటాల మురళీకృష్ణ కోరారు.

### ఇన్వర్టర్ బహూకరణ

పి.గన్నవరం: నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1991–92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు శనివారం రూ.18 వేల విలువైన ఇన్వర్టర్‌ను బహూకరించారు. పాఠశాల హెచ్ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమీపిస్తున్న వరదల సమయం

- గోదావరి గట్ల పటిష్టతపై కానరాని శ్రద్ధ
- ఫ్లడ్ స్టోర్ సామగ్రి కొనుగోలుకు అధికారుల ప్రతిపాదన
- నేటికీ సమకూర్చని ప్రభుత్వం



కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో సిద్ధంగా ఉన్న సామగ్రి

కపిలేశ్వరపురం: మే నెల పూర్తయింది. జూన్‌లో వర్షాలు ఆరంభమవుతాయి. గోదావరి సమీపంలో కానీ, పై భాగంలో కానీ వర్షాలు తీవ్రమైతే వరద ఉధృతి పెరుగుతుంది. వరద ప్రవాహ ధాటిని తట్టుకోవాలంటే ఏటిగట్లను బలోపేతం చేయాలి. అందుకు ముందస్తుగానే చర్యలు చేపట్టాలి. అడపాదడపా చినుకులు పడుతుండటంతో గట్లు పటిష్ట పనులకు ఆటంకం ఏర్పడే అవకాశాలున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో గోదావరి లంక గ్రామాలనేకం ఉన్నాయి. వరద సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కానీ, మండల స్థాయి అధికారులతో కానీ ఇప్పటి వరకూ సమావేశాలను ఏర్పాటు చేయలేదు. కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో వరద రక్షణ సామగ్రి సరిపడా ఉన్నప్పటికీ కోటిపల్లి ఫ్లడ్ స్టోర్‌కు సామగ్రిని మరింత సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది.

**ఫ్లడ్ స్టోర్‌లను సన్నద్ధం చేయరూ...**

గోదావరి గట్లు బలహీనపడినప్పుడు పటిష్ట పర్చేందుకు ఇసుక, సంచులు, భారీ గేటు కర్రలు, గడ్డపారలు, పారలు ఇతర సామగ్రి అవసరమవుతుంది. రెండు నియోజకవర్గాల పరిధిలో కపిలేశ్వరపురం, కోటిపల్లిలలో రెండు ఫ్లడ్ స్టోర్‌లున్నాయి. కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్ పరిధిలో గట్లు పటిష్టంగానే ఉండటంతో గత సంవత్సరంలో సమకూర్చుకున్న సామగ్రి దాదాపు సరిపోతుందన్న అంచనాకు అధికారులు వచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం కపిలేశ్వరపురం ఫ్లడ్‌స్టోర్‌లో 1,000 సర్వేబాదులు, 2,800 వెదురుబాదులు, 30 వేల సంచులు, 370 క్యూబిక్ మీటర్ల ఇసుక, కత్తులు, పారలు, గొడ్డళ్లు సిద్ధంగా ఉన్నాయి. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం పరిధిలో సుందరపల్లి గ్రామ సమీపంలో రెండు చోట్ల, కూళ్ల లాకులు సమీపంలో ఒక చోట గోదారి గట్లు బలహీనంగా ఉన్నాయి. వరద సమయంలో ఆయా గట్లు బలహీనపడితే వెంటనే కోటిపల్లిలోని ఫ్లడ్ స్టోర్‌లోని సామగ్రిని వినియోగించాల్సి ఉంటుంది. ఫ్లడ్ స్టోర్‌లోకి పాత సామగ్రికి తోడు మరింత సామగ్రిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. వాటిని ప్రభుత్వం ముందస్తుగా సమకూర్చుకోవడం ద్వారా వరద సమయంలో ప్రమాదాలను నివారించుకునే అవకాశం ఉంటుంది.

**లంక గ్రామాల పరిస్థితి ఇలా..**

రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం శేరిలంక, మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలంలో కేదారిలంక పంచాయతీ పరిధిలో శేరిగూడెం, వీధివారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, కోరుమిల్లిలంక గ్రామాలు దాదాపు గోదావరి నదిలో ఉన్నాయి. ఇవి కాకుండా కె.గంగవరం మండలం పరిధిలో కూళ్ళ, మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి గ్రామాలు గోదావరి తీరాన ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ వరదల వేళ ఇబ్బందులను ఎదుర్కొంటాయి. మండల కేంద్రమైన కపిలేశ్వరపురానికి గోదావరి అవతల ఒడ్డున సుమారు 25 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో కేదారిలంక, అద్దంకివారిలంక శివారు గ్రామాలు ఉండటంతో వరదల సమయంలో పాలనాపరమైన సమస్యలు ఎదురవుతుంటాయి. అక్కడి వ్యవసాయ క్షేత్రాలు, నివాస ప్రాంతాలు ముంపుబారి పడతాయి. సాయమందించేందుకు కపిలేశ్వరపురం నుంచి పడవల్లో ఆహార పదార్థాలను అధికారులు తరలిస్తుంటారు.

**ముందస్తు చర్యలపై దృష్టి సారించాలి**



వరద సమయంలో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గోదారి గట్ల పటిష్టానికి తగిన చర్యలను వెంటనే చేపట్టాలి.

– పోలిశెట్టి గణేష్, కేదారిలంక, కపిలేశ్వరపురం

**సరిపడా సామగ్రి ఉంది**



కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో తగిన సామగ్రిని సిద్ధం చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలపై అప్రమత్తంగా ఉంటాం. వరద ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఆర్.విశ్వనాథరాజు, హెడ్ వర్క్స్ ఏఈ

# కూటమి విద్రోహ పాలనకు చరమగీతం పాడుదాం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- 4న వెన్నుపోటు దినంగా పిలుపు



'వెన్నుపోటు దినం నిరసన' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు



సమావేశంలో పాల్గొన్న మండపేట పట్టణ, రూరల్ గ్రామాల ప్రజలు

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి ప్రభుత్వ విద్రోహ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం మండపేట పట్టణం, రూరల్ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏడాది కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టేందుకు ప్రజల్లోకి వెళ్లే విషయమై పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేశారని ఎమ్మెల్సీ తోట అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 4న నిర్వహించ తలపెట్టిన 'కూటమి ప్రభుత్వ వెన్నుపోటుదినం ' కార్యక్రమాన్ని విజయవంతం చేసే లక్ష్యంగా సన్నాహక సమావేశం నిర్వహించుకుంటున్నామన్నారు. వైఎస్ జగన్ పాలన అంతా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఐదేళ్లు సాగిందని, కూటమి ప్రభుత్వ ఏడాదిలోనే ప్రజలకు దూరమైందన్నారు. సామాన్య ప్రజలు సైతం గత వైఎస్సార్ సీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాల పాలనా తీరులను పోల్చి చూసుకుంటున్నారన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య ప్రజలకు సంక్షేమాన్ని అందించడాన్ని ఆపలేదన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికీ వెళ్లి మరీ సామాన్య ప్రజలకు ప్రభుత్వ లబ్ధిని అందించిన చరిత్ర వైఎస్ జగన్‌ది అని అన్నారు. అధికారంలో లేని ప్రస్తుత రోజుల్లోనైనా ప్రజలక వద్దకు వెళ్లి జగన్ పాలనలో మీకు ఫలానా సాయం చేశామని చెప్పుకునే ధైర్యం వైఎస్సార్ సీపీ కార్యకర్తలకే ఉందన్నారు. వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు పూర్తి భిన్నంగా ప్రస్తుత కూటమి పాలన సాగుతుందని, ఏడాదిలోనే మెజారిటీ ప్రజలకు ప్రభుత్వం దూరమైందన్నారు. వైఎస్ జగన్ పాలనా కాలంలో ప్రతి మూడు నెలలకు ఒకసారైనా కొత్త పింఛన్లను మంజూరు చేసేవారన్నారు. ప్రస్తుత కూటమి ఏడాది పాలనా కాలంలో కొత్త పింఛన్లు ఇవ్వకపోగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల మంది పింఛన్లను రద్దు చేశారన్నారు. పేరుకు పింఛను సొమ్మును రూ.4 వేలకు పెంచామని చెప్పుకుంటున్నప్పటికీ అర్హుల పింఛన్లను రద్దు చేసిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. చివరికి దివ్యాంగుల పింఛన్లను తొలగించి అమానవీయంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సాంకేతికంగా ఒకటి అరా అనర్హులెవరికైనా దివ్యాంగ పింఛను ఇచ్చి ఉంటే ఉండొచ్చు. ఆ పేరు మీద అర్హులైన దివ్యాంగుల పింఛన్లను తొలగించేశారని క్షేత్ర స్థాయి పరిశీలనలో తేలిందన్నారు. జగన్ హయాంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయ నాయకుల ప్రాబల్యం అనేవి లేకుండా పింఛన్లు ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ సీపీదన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. చంద్రబాబుకు ఉన్న చరిత్ర నేపథ్యంలోనే జూన్ నాలుగున వెన్నుపోటు దినంగా నిరసన తెలపాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన విధానంపై ఎమ్మెల్సీ తోట కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు పట్టాభి రామయ్య చౌదరి మాట్లాడుతూ కార్యకర్తలంతా ఒక్కతాటిపై ఉంటూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ 4వ తేదీ నిరసన కార్యక్రమానికి పట్టణ ప్రజలను పెద్ద ఎత్తున కదిలించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 'వెన్నుపోటు దినం నిరసన' పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట తనయుడు పృథ్వీరాజ్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు పిల్లా వీరబాబు, కురుపూడి రాంబాబు, సిరిపురపు శ్రీనివాస్, విప్ పోతంశెట్టి ప్రసాద్, పెంకే గంగాధర్, ఉషారాజేష్, పలివెల సుధాకర్, తిరుశూలపు శ్రీను, తోరం శ్రీను, మట్టపర్తి గోవిందరాజు, పిల్లా సూర్యనారాయణ, దొంతులూరి శ్రీరామవర్మతదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి అనుమానాస్పద మృతి



నారాయణరావు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటకు చెందిన కొప్పిశెట్టి నారాయణరావు (51) అనుమానాస్పద మృతి చెందడంపై అతడి భార్య సంధ్యారాణి ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే మృతుడు నారాయణరావు తన స్నేహితుడితో కలసి శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చాడు. నారాయణరావును ఇంటి వద్ద దింపి వెళ్లిపోయిన ప్రసాద్ మళ్లీ ఫోన్ చేసి రమ్మనడంతో నారాయణరావు బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి 12 దాటినా భర్త ఇంటికి రాకపోవడంతో సంధ్యారాణి ప్రసాద్‌కు ఫోన్ చేయడంతో నారాయణరావు అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దీంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేసరికి భర్త చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ శనివారం విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా పోస్టుమార్టం అనంతరం ఇంటికి తీసుకుని వచ్చిన నారాయణరావు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, శెట్టిబలిజ సంఘ పెద్దలు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, కడలి రామకృష్ణ, నాయకులు వాసంశెట్టి శ్యామ్, టేకుమూడి సత్యనారాయణ, ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తదితరులు

రామచంద్రపురం: నిబంధనలను విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం ఎస్సై ఎస్.నాగేశ్వరావు అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం మూలంగా కలిగే నష్టాలను వివరిస్తూ పట్టణంలోని ప్రధాన రహదారిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందికి రామచంద్రపురం ఏజేఎస్‌సీఎం కోర్టు జడ్జి నాగేశ్వరరావు నాయక్ రూ.1.50 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే వారికి రూ.11 వేల వరకు జరిమానా, ఆరునెలల జైలు శిక్ష విధించబడుతుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తాగి వాహనాలను నడిపి ఎటువంటి ప్రమాదాలకు గురికాకూడదని హితవు పలికారు. మద్యం తాగి వాహనం నడిపిన 15 మంది వ్యక్తులతో అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు.

# మున్సిపల్ కార్మికుల ఆందోళనకు మద్దతు



మండపేట మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు మద్దతు పలుకుతున్న సీఐటీయూ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): 15 సంవత్సరాలు సర్వీసు ఉన్న తమను శాశ్వత ఉద్యోగులుగా చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు సీఐటీయూ మద్దతు పలికింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరానికి వెళ్లి శుక్రవారం సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి సంఘీభావాన్ని తెలిపారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసి అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు. రోజుల తరబడి మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు వివిధ పద్ధతుల్లో ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా వ్యవహరిస్తుందన్నారు. పట్టణ వాసుల రోజువారీ జీవితంలో నిత్యం సేవలందించే కార్మికుల సమస్యల పరిష్కారం ప్రభుత్వం బాధ్యత అన్నారు. త్వరితగతిన కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కృష్ణవేణి అన్నారు.

# సీఎం పర్యటనలో పోలీసుల తీరు సరికాదు

ఆలమూరు: విద్యార్థుల సమస్యలను చెబుదామని సీఎం చంద్రబాబు పర్యటించిన ప్రాంతానికి వస్తే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ విమర్శించారు. ఆలమూరులో శనివారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేస్తామని చెయ్యేరు వెళితే అక్కడ తమను పోలీసులు అడ్డుకోవడంతో పాటు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఇక నుంచి విద్యార్థుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, సతీష్, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సైకిల్ ర్యాలీని విజయవంతం చేయండి

మలికిపురం: ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుదాం, పర్యావరణం కోసం సైకిల్ తొక్కుదాం అనే నినాదంతో జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా హెల్దీ సైక్లింగ్ గ్రూపు ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కళాశాల ప్రాంగణం నుంచి సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ వరకు జరుగుతుంది. అలాగే తిరిగి మలికిపురం గాంధీ బొమ్మల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. సైకిల్ లవర్స్, ఆరోగ్యాభిలాషులు, వాకర్స్ తమ తమ సైకిళ్లతో విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేధం కోసం స్టీల్, రాగి బాటిళ్లతో మంచి నీళ్ళు తెచ్చుకోవాలని, తెల్లని దుస్తులు ధరించి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. బోనం రాజు, పీవీవీఎస్ ప్రసాద్, రమేష్ బాబు, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు లాభం



అంబాజీపేట పరిశోధన కేంద్రంలో విజ్ఞాన ప్రదర్శనను పరిశీలిస్తున్న చలపతిరావు, ముత్యాల నాయుడు

అంబాజీపేట: అన్ని రకాల పంటల సస్యరక్షణకు సంబంధించి డ్రోన్ టెక్నాలజీని రైతులు వినియోగిస్తే మంచి ఫలితాలతో పాటు అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి డా.ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో రావేప్ వ్యవసాయ విద్యార్థులతో రైతు సదస్సును కేంద్ర అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. చలపతిరావు మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అందుకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం వల్ల ఎన్నో లాభాలు పొందవచ్చన్నారు. రావేప్ (గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం) వ్యవసాయ విద్యార్థులు 19 అంశాలతో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వ్యవసాయ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, రాబోయే తరాలకు ఉపయోగపడే నూతన ఉద్యానసాగుపై ప్రదర్శించిన నృత్య రూపకం రైతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, డాక్టర్ వి.అనూష. డాక్టర్ బి.నీరజ, డాక్టర్ ఎ.కిరీటి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీ సత్యవతి, రైతులు, రావేప్ విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సెక్షన్‌లోని పలు గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సూచనల మేరకు రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో ఉన్న పాడైన టవర్లు తొలగించి కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్న దష్ట్యా 33/11 కేవీ, 11 కేవీ లైను క్రాసింగ్ ఉండటం కారణంగా ద్రాక్షారామ సెక్షన్‌లోని 11 కేవీ తాళ్లపాలెం ఫీడర్ మీద ట్రీ ట్రిమ్మింగ్ పనుల నిమిత్తం నెలపర్తిపాడు, గణపతి నగరం, మామిడిగుంట, జగన్నాయకులపాలెం, జగనన్న కాలనీలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

### రీ వేల్యూయేషన్లో లోపాలు కూడా సరిదిద్దలేదు

మలికిపురం: పదో తరగతి పరీక్షలు రాసిన (2025) విద్యార్థులకు పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక అవకతవకలు జరగడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసినప్పటికీ మూల్యాంకనం సరిగా చేయకపోవడంతో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యారని, తల్లిదండ్రులు రూ.వెయ్యి రీ వేల్యూయేషన్ ఫీజు కట్టినప్పటికీ రీ వేల్యూయేషన్లో జవాబులు సరిగా ఉన్నవాటికి కూడా మార్కులు వేయకుండా యథాతథంగా తిరిగి మార్కుల లిస్ట్ పంపించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీనిపై అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశామన్నారు. అదే విధంగా ట్రిపుల్ ఐటీలో కూడా ప్రవేశాలకు తగినంత సమయం లేదు. కాబట్టి ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలను జూన్ పది వరకు పెంచాలని రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మూల్యాంకనంలో తప్పులు చేసి విద్యార్థులకు నష్టం కలిగించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ సమీపాన వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు ఆదినారాయణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, గణపతి పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, కొర్లపాటి గోపి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### వైభవంగా స్వామి వార్ల దివ్య కల్యాణం



గోగన్నమఠంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: గోగన్నమఠంలో కొలువైన చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి, శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దివ్య తిరు కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వార్ల దశమ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం వేద మంత్రాలతో ఆలయ అర్చకులు స్వామి వార్ల ధృవ మూర్తులకు విశేష అభిషేకం జరిపించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు ఈ కల్యాణోత్సవంలో కల్యాణ కర్తలుగా పాల్గొన్నారు. తదుపరి స్వామి వార్ల గ్రామోత్సవం కన్నులపండువలా జరిగింది. పుష్పోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

### శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవదాయ–ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ 1,57,085 ఆదాయం వచ్చినట్లు డీసీ అండ్ ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.34,362 రాగా మొత్తం రూ.1,91,447 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.